



**8**

## గత సంచికనుంచి కొనసాగింపు

**జరిగిన జగన్నాటకం**

**అందరూ ఎడమచేతిని వాడే సవ్యలంకలో కుడి చేతిని వాడినందుకు బోసుకు మరణదండన విధించబోయారు. ఆచార్య వేదాంతం, ద్వీప, పశుపాల కలిసి బోసుని కాపాడారు. జలపతిని కలిసి ఆ ద్వీపాన్ని దాటాలని ప్రయత్నిస్తున్నాడు బోసు. జలపతి ఓడలో అన్నిరకాల జంతువులు జంటలుగా వున్నాయి. బోసే భవిష్యజ్ఞాన గ్రంధంలో చెప్పబడిన మహాబసు అని ద్వీప చెప్పింది. ఓడ దిగిన బోసుపై దాడి చేశారు దళాధిపతి సైనికులు.**

సముద్రానికి నూరు అడుగులదూరంలో వున్నాడు బోసు. అతని చేతిలో వున్న కత్తి అత్యంత లాఘవంగా కదులుతోంది. అప్పటికే ఆరుగురు సైనికులు నేలకొరిగారు. ఎందరో వీరుల్ని స్వయంగా చూసిన జలపతి కూడా ఆశ్చర్యం ఆనందం కలగలిపి చూస్తున్నాడు.

“సందేహం లేదు... ఆయనే మహాబసు” అన్నాడు. మిగిలిన ఇద్దరూ తలాడించారు.

సరిగ్గా అప్పుడే బోసుకు కుడి వైపు నుంచి మృత్యువు దూసుకువస్తున్న సంగతి వాళ్ళు గమనించలేదు. ఆ మృత్యువు పేరు దళాధిపతి. తెలుసుకునే సరికే అతను తన గుర్రం మీద కత్తి తిప్పుతూ బోస్ వైపు దూసుకొస్తున్నాడు. జలపతి చేతిలో వున్న అంబుని మరుక్షణం

పైకెత్తి బాణాన్నిసంధించాడు, కానీ ఉత్తర క్షణంలో ఆ బాణం అంత దూరం వెళ్ళదని అర్థం చేసుకున్నాడు. ఒకవేళ వెళ్ళినా అత్యంత లాఘవంగా గుర్రాన్ని నడుపుతూ ముందుకు వస్తున్న దళాధిపతిని సరిగ్గా తాకడం అసంభవం. గురి తప్పితే చరిత్ర గతి మారిపోతుంది. అతని చేతులు గడగడ వణికుతున్నాయి. క్షణక్షణానికి సారించిన వింటినారి తిరిగి యధాస్థానానికి చేరుకుంటోంది.

"బాణం విడిచిపెట్టండి జలపతీ" ద్వీప అరిచింది. ఆయన తల అడ్డంగా ఊపి విల్లంబులను కిందకు దించేశాడు.

బోస్ కుడివైపు నుంచి గుర్రాన్ని నడుపుతూ వస్తున్న దళాధిపతి మరింత దగ్గరయ్యాడు. అతను వస్తున్న విషయాన్ని గమనించకుండా ఇద్దరు సైనికులతో యుద్ధం చేస్తున్నాడు. దళాధిపతికి ఇది మంచి అవకాశంలా కనిపించింది. 'గుర్రాన్ని బోస్ వెనక వైపు నుంచి నడిపించి, వెనక నుంచే ఒక్క వేటు మెడ మీద వేస్తే చాలు' అనుకున్నాడు. ఉత్సాహంతో ముందుకు వంగి కత్తిని గిరగిరా తిప్పుతున్నాడు.

ఒక మహాపోరాటానికి నాయకుడని నమ్మిన వ్యక్తిని మరణం కబళించడం కళ్ళ ముందే కనపడింది ఓడ మీద నుంచి చూస్తున్న ముగ్గురికీ. జలపతి స్థాణువులా నిలబడిపోయాడు. పశుపాల గట్టిగా అరుస్తున్నాడు. అక్కడ బోసు మెడను కత్తిరించడానికి లేచిన కత్తిని చూసి కళ్ళు మూసుకుంది ద్వీప.

ఖంగ్..!! అంటూ శబ్దం ప్రతిధ్వనించింది.

ద్వీప కళ్ళు తెరిచింది. ఆమెకు మొదట కనపడ్డది దళాధిపతి. బోసుని దాటేసి ముందుకు వెళుతున్నాడు. అతని చేతిలో కత్తిలేదు. ఇటు చూస్తే బోస్...!! బతికే వున్నాడు!!

లిప్తపాటులో తప్పిపోయిన మృత్యువు వైపు విభ్రమంగా చూస్తున్నాడు బోసు. తల తిప్పి నేల మీద చూశాడు. దళాధిపతి కత్తి కిందపడుంది. ఆ కత్తిని రెండుగా చీల్చేసిన బాణం ఇంకా ఆ కత్తిలోనే దిగబడి వుంది. ఆశ్చర్యపోయాడతను.

ద్వీప జలపతి చేతి వైపు చూసింది. అతని చేతిలో బాణం అలాగే వుంది. జలపతి బాణం వదలకపోతే దళాధిపతి చేతిలో కత్తిని కొట్టిందెవరు? ఆశ్చర్యంగా అన్ని వైపులా తలతిప్పి చూసింది. బోసుకి అవతల వైపు పద్దెనిమిది గుర్రాలు, వాటి పైన అధిరోహించి వున్న వ్యక్తులు కనిపించారు. వాళ్ళలో అందరికన్నా ముందు వున్న వ్యక్తి అప్పుడే అతని చేతిలోని విల్లంబుని కిందకు దించాడు. పూర్తిగా నల్లటి దుస్తులు వేసుకోని వున్నాడతను. నల్లటి గుర్రం. కానీ ఇవేవీ కావు ఆమెను ఆకర్షించినవి. అతని తలపైన చుట్టుకున్న తలపాగ..! అది ఎర్ర రంగు గుడ్డ!!

"అతను... అతను..." అంటూ తడబడుతోంది ద్వీప

"అవును అతనే" చెప్పాడు జలపతి. "ఉగ్ర" అన్నాడు చివరగా!

అంటూనే ఒక్కసారిగా బోసు వైపు పరుగులంకించుకున్నాడు. అతని వెంటే పశుపాల, ఆ వెనుకే ద్వీప పరుగెత్తారు.

★★★

హాలాహలం పుట్టినట్లు ఒక్కసారిగా సైనికులలో కలకలం మొదలైంది.

"ఉగ్ర... ఉగ్ర" అంటూ ఒకరి నుంచి మరొకరికి ఆ పేరు దావానలంలా వ్యాపించింది. నాలుగు దిక్కులవైపు ఆ సైనికులు చల్లాచెదరౌతుంటే ఆశ్చర్యంగా చూశాడు దళాధిపతి. భయంతో ఎటు వెళ్తున్నారో తెలియక కొంతమంది ఉగ్ర ఉన్నవైపే పరుగెత్తి, అతను అటువైపే వున్నాడని తెలుసుకోని వెనక్కి తిరిగి, వెనుకగా వస్తున్న వాళ్ళని ఢీకొని, మిగిలిన మూడు దిక్కులవైపు పరుగెత్తారు. మరో వైపు నుంచి పరుగెత్తుకుంటూ వస్తున్న జలపతిని, ద్వీపని చూసి వాళ్ళ భయం రెండింతలై, జరుగుతున్నదేమిటో అర్థం కాక, కేకలు పెడుతూ పారిపోయారు.

బోస్ విభ్రమంగా వాళ్ళ వైపు చూశాడు. వాళ్ళు ఎవరిని చూసి పారిపోతున్నారో అర్థం కాక తల తిప్పి వెనుక వైపు చూశాడు. నల్లటి గుర్రం మీద నల్లటి దుస్తులు వేసుకొని, ఎర్రటి తలపాగాతో వున్న ఉగ్రని చూశాడు. అతను తను చెయ్యాల్సిన పని అయిపోయిందన్నట్లు నిర్లిప్తంగా చెల్లాచదరౌతున్నది సైనికులనే చూస్తున్నాడు. అతని వెనుక వున్న పదిహేడు మంది, ముఖం మీద విజయదరహాసాన్ని నింపుకోని తోచిన వైపుకు విల్లంబులను ఎక్కుపెట్టి బాణాలను వదులుతున్నారు. ఉగ్ర గుర్రాన్ని నెమ్మదిగా ముందు నడిపిస్తూ బోస్ దగ్గరకు వచ్చాడు. మరో వైపు నుంచి వస్తున్న జలపతి, ద్వీప, పశుపాల బోస్ దగ్గరగా వచ్చి చేరారు.

"బోస్ కదూ నువ్వు?" అన్నాడు ఉగ్ర తన గుర్రం దిగుతూ.

"కాదు ఆయన మహాబసు" చెప్పాడు జలపతి. గట్టిగా నవ్వాడు ఉగ్ర.

"మృత్యువుకి భయపడి ద్వీపాన్ని వదిలి పారిపోవాలనుకున్నవాడు మహాబసు ఎలా అవుతాడు? మరణాన్ని ఆయుధంగా మార్చుకోని శత్రువుల్ని చీల్చిచెండాడుతాడని కదా మీ భవిష్యజ్ఞానం చెప్పింది?" అన్నాడు గొంతులో వున్న వ్యంగ్యాన్ని ఏమాత్రం దాచుకునే ప్రయత్నం చెయ్యకుండా. బోసుకి కాస్త ఇబ్బందికరంగా అనిపించింది.

"మీకు ఎలా అనిపించినా సరే, నా ప్రాణాన్ని కాపాడినందుకు ధన్యవాదాలు" అన్నాడు అసహనాన్ని కప్పిపుచ్చుకుంటూ.

"ఇప్పుడుకాదు... నీకు మరణదండన విధించినప్పుడే నిన్ను రక్షించడానికి సిద్ధపడ్డాను. నా బాణం అంబుని దాటకముందే ద్వీప ధర్మనారీ సమితితో నిన్ను కాపాడింది. మరొకరి రక్షణలో ప్రాణాలు కాపాడుకునేవాడు ఈ ద్వీపాన్ని రక్షిస్తాడంటే నేను నమ్మను" అన్నాడు.

"నమ్మనివాడివి రెండుసార్లు కాపాడాలని ఎందుకు అనుకున్నావు?" అడిగింది ద్వీప కోపంగా.

"ధర్మం. దయ. ఏదో వేరే ప్రదేశం నుంచి పొరపాటున వచ్చిన వ్యక్తి, ఇక్కడి నియమాలు తెలియక తప్పు చేస్తే కనీసం మొదటిసారి క్షమించడం ధర్మం. తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోడానికి దళాధిపతి చేయబూనిన మారణకాండకి బలి కాబోతున్నాడన్న దయ." చెప్పాడు ఉగ్ర. అప్పటికే అతను బోసుకి దగ్గరగా వచ్చి తీక్షణమైన చూపులతో నఖశిఖపర్యంతం అతన్ని పరిశీలిస్తున్నాడు.

"ఒక వేళ నేను కూడా ఎడమచేతిని వాడేవాడినే అయ్యుండి, మరో కారణానికి దళాధిపతి చేతిలో మరణించబోయుంటే అప్పుడు కూడా కాపాడేవాడివా? నన్ను చంపబోయింది నీ అనుచరుల్లో ఒకడైతే అప్పుడు కూడా నీకు దయ కలిగేదా?" అడిగాడు బోసు. అనుకోకుండా ఆ ప్రశ్న తన నోటి నుంచి ఎలా వచ్చిందో అతనికి అర్థం కాలేదు. కానీ తీవ్రమైన ప్రశ్న వేశాడని మరుక్షణం అతనికి బోధపడింది. ఉగ్ర చుట్టుపక్కల వున్న అనుచరులు ఆవేశంతో ముందుకు రాబోయి, ఉగ్ర వారించడంతో ఆగిపోయారు.

ఉగ్ర క్షణం పాటు ఆశ్చర్యపోయినా చిన్నగా చిరునవ్వు నవ్వి బోసుకి మరింత దగ్గరగా వచ్చాడు. సమాధానం చెప్పాలని వున్నా చెప్పకుండా నియంత్రించుకోని బోసు భుజం మీద తట్టాడు.

"నేను వచ్చిన పని అయిపోయింది. ఇక వస్తాను" అని మాత్రం అన్నాడు.

"నీ బాధ్యత ఇప్పుడే మొదలైంది ఉగ్రా" అన్నాడు జలపతి. అర్థంకానట్టు అతని వైపు చూసిన ఉగ్ర, అతని చిరునవ్వు చూసి మారు ప్రశ్నించకుండా బోసు వైపు చూశాడు.

అప్పటిదాకా ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ, వాళ్ళు గమనించని విషయం ఒకటుంది. చెల్లాచెదరైన దళపతి సేనలు మళ్ళీ ఒకటిగా మారి, వాళ్ళ నాయకుడి ఆదేశాలను అనుసరించి సముద్రపు ఒడ్డున వున్న ఓడ వైపు దూసుకుపోయారు. దాన్ని చేరుకున్న మరుక్షణం వాళ్ళ దగ్గరున్న ఆయుధాలతో ఆ ఓడకి కట్టిన తాళ్ళను తెగకొట్టడం ప్రారంభించారు. ఆ విషయాన్ని మొదటగా గమనించాడు పశుపాల.

"జలపతీ... ఓడ మీద దాడి చేస్తున్నారు" అని అరుస్తూ అటువైపు పరుగెత్తాడు.

మరుక్షణం జలపతి అటు తిరిగి నిశ్చేష్టుడై అలాగే నిలబడిపోయాడు. బోసు, ద్వీప జలపతి ఏమంటాడో అని అతనివైపే చూస్తూ వుండిపోయారు. గట్టిగా ఉగ్ర నవ్విన నవ్వు అక్కడ ప్రతిధ్వనించింది.

"సమస్యకి వెన్నుచూపే ప్రయత్నాన్ని ఏ దేవుడూ క్షమించడు. పోరాటం జీవలక్షణం. పారిపోవటం జీవించే హక్కుని కోల్పోవటం. ఆ ఓడ మునిగిపోవటమే న్యాయం" అన్నాడు. జలపతి అభావంగా అతని వైపు చూశాడు. ఓడని కాపాడుకోవాలన్న తపన అతనిలో ఏ మాత్రం లేదు. ఓడ లేకపోతే ఈ ద్విపాన్ని వదిలి వెళ్ళటం అసాధ్యం అని బోసు ఒక్క క్షణం అనుకున్నాడు కానీ ముందుకు కదలాలని అనిపించక అక్కడే ఆగిపోయాడు.

"నిముషం క్రితం ధర్మం అన్నావు గుర్తుందా ఉగ్రా... ఆ ఓడలో వందలాది జీవరాశులు వున్నాయి. ఏ తప్పు చేయని ఆ మూగజీవాలు మరణించడం ధర్మమేనంటావా?" అన్నాడు జలపతి నింపాదిగా.

"మహాప్రళయం వస్తోందని ఊహించారా?" అన్నాడు ఉగ్ర. తలాడించాడు జలపతి.

మరుక్షణం గుర్రపు కళ్లాన్ని ఒకచేతితో, దాని జీనుని మరో చేత్తో పట్టుకోని, "హోతా" అని అరుస్తూ ఒక్క గెంతు గెంతి గుర్రంపై ఎక్కాడు ఉగ్ర. ముందుకు లంఘించిన గుర్రం మీదే వుండి, జలపతిని ఒక చేత్తో పట్టుకోని ఒడుపుగా గుర్రం మీదకు లాక్కున్నాడు. జరిగింది అర్థమయ్యేలోగా ఇద్దరూ గుర్రం మీద వున్నారు. అది ఓడ దిశగా సాగిపోయింది.

ఉగ్ర వెనుక వున్న అనుచరుల్లో ఒకడు కిందకు దిగి, ఆ గుర్రాన్ని ద్వీప చేతికి అందించి మరో గుర్రం మీదున్న మరో అనుచరుడితో కలిసి వెళ్ళిపోయాడు. ద్వీప వెంటనే తన చేతిలో వున్న గుర్రాన్ని ఎక్కి, బోసుని కూడా ఎక్కించుకుందామని వెనక్కి చూసింది. అప్పటికే మరో అనుచరుడు బోసుని గుర్రం మీదకు లాక్కున్నాడు. దాంతో అన్ని గుర్రాలు ముందుకు ఉరికాయి.

"నా పేరు సుధాముడు..." అన్నాడు బోసుని ఎక్కించుకున్న వ్యక్తి. బోసు తలాడించబోతుండగా అతని చివరి మాట వినపడింది – "మహాబసూ.." అని. ఆశ్చర్యపోయాడు. క్షణం క్రితం ఆ అనుచరుడి నాయకుడు, మహాబసు అనే భవిష్యజ్ఞానం అబద్ధం అని అన్నాడు. ఇప్పుడు అనుచరుడు తనని మహాబసూ అని సంబోధిస్తున్నాడు. అదే అడగబోయాడు బోసు.

"మీరేం చెప్పకండి. మీరే మహాబసు అని నేను నమ్ముతున్నాను. మీకు ఆశ్చర్యంగా అనిపిస్తుందని నాకు తెలుసు. మేము చేస్తున్న పోరాటం మేము నమ్మిన సిద్ధాంతం కోసమే. కానీ ఆ ఒక్క సిద్ధాంతమే సత్యమని, మిగిలిన సిద్ధాంతాలన్నీ అసత్యమని ఎందుకు నమ్మాలి. నా దృష్టిలో మీరే మహాబసు." అన్నాడు స్థిరంగా.

అప్పటికే వాళ్ళిద్దరూ ఓడ దగ్గరకు చేరుకోవడంతో మాటలు ఆగిపోయాయి. గుర్రం జీనుకు బిగించిన కత్తిని అందుకోని సుధాముడు దళాధిపతి సైన్యం మీద విరుచుపడ్డాడు. అప్పటికే జలపతి, ద్వీప, ఉగ్ర, అతని అనుచరులు శతృసైన్యం మీద తమ కరవాలాలను ఝులిపిస్తున్నారు.

దళాధిపతి సైన్యం రెండు భాగాలుగా విడిపోయింది. ఒక సగం ఎదురుకోడానికి వచ్చిన ఉగ్ర, జలపతితో పోరాడుతున్నారు. వాళ్ళంతా మరణానికి సిద్ధమైనట్లు పోరాటం సాగిస్తున్నారు. మరో సగం మంది ఓడని నిలబెట్టడానికి కట్టిన లంగరు తాళ్ళను తెగకొడుతున్నారు. వారిలోనే కొందరు చేతికి అందిన ఆయుధాలను విసిరి ఓడని పగలకొట్టే ప్రయత్నం చేస్తున్నారు.

ఉగ్ర తన ఉగ్రరూపాన్ని చూపిస్తున్నాడు. దళపతి ఆజ్ఞను కాదనలేకు ముందుకు వచ్చిన సైనికులు ఉగ్రని చూసి మృత్యువుని ప్రత్యక్షంగా చూసినట్లు భయపడిపోతున్నారు. మరో వైపు జలపతి, ద్వీప, పశుపాల అడ్డంగా నిలబడ్డ సైనికులను ఛేదించి ఓడను చేరుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

వీళ్ళందరికన్నా చివర అక్కడికి చేరుకున్న బోసు సైనికులను ఎదిరించకుండా చాకచక్యంగా వాళ్ళని తప్పుకోని నేరుగా ఓడలోకి ప్రవేశించాడు. వీలైనంత వరకు అందులో వున్న జంతువులను బయటికి వదిలిపెట్టాలని అతని ఆలోచన. ఓడలో జంతువులన్నీ వున్న చోటుకి చేరుకోని అక్కడి తలుపులని తెరిచే ప్రయత్నం చేయబోడు. కానీ అప్పటికే ఆలస్యమైపోయింది. పడవ ఒక వైపుకి ఒరిగిపోవడం మొదలైంది. బహుశా ఏదో ఒక్క లంగరు ఆధారంగా ఓడ నిలబడినట్లు అతనికి అనిపించింది. అయినా తన ప్రయత్నం ఆపలేదు. తలుపులు తెరిచాడు.

బయట పోరాటం సాగుతూనే వుంది. ఓడ నిలబడటానికి వేసిన లంగర్లు ఒక్కొక్కటిగా తెగిపోవటం చూస్తున్న ఉగ్ర, జలపతి రెట్టించిన కోపంతో పోరాడుతూనే వున్నారు. మరో వైపు ద్వీప కత్తి తిప్పుతూ, అత్యంత లాఘవంగా సైనికులను హతమారుస్తూ 'మహాబసు' వెళ్ళిన వైపు ఆశ్చర్యంగా చూస్తూనే వుంది. అంతలోనే వాళ్ళంతా జరగకూడదనుకుంటున్నది జరిగిపోయింది. లంగర్లన్నీ తెగిపోయిన ఓడ సముద్రపు అలలకు ఒక్కసారిగా ముందుకు కదిలి మళ్ళీ వెనక్కి సముద్రంలోకి జారిపోసాగింది. సైనికుల విజయధ్వానాలు ఒక్కసారిగా మిన్నుముట్టాయి. లంగరు కట్టిన తాళ్ళను తెగ్గొట్టిన సైనికులు ఒకరినొకరు అభినందించుకుంటూ అరుచుకుంటూ సముద్రంలో నుంచి పరుగులుపెడుతూ ఒడ్డు వైపుకు రాసాగారు. వాళ్ళు గమనించని మరో సంఘటన కూడా అప్పుడే జరిగింది.

సైనికుల ఆయుధాలు తాకి దెబ్బలు తిన్న ఓడ బయటి వైపు భాగాలు ఒక్కొక్కటిగా ముక్కలై పడిపోసాగాయి. అలా పడిపోయిన ఓడ భాగాల వల్ల ఏర్పడ్డ ఖాళీల నుంచి ఒక్కొక్కటిగా జంతువులు బయటికి దూకసాగాయి. అలా దూకిన జంతువుల్లో కొన్ని క్రూరమృగాలు భీకరంగా అరుస్తూ ఆ సైనికుల మీద విరుచుకుపడ్డాయి. ఒడ్డు వైపు పరుగెత్తుకుంటూ వస్తున్న సైనికులని వాళ్ళ వెనకే వస్తున్న జంతువులను చూసి మిగితా సైనికులు జరిగిందేమిటో అర్థం కాక యుద్ధాన్ని ఆపేసి అటే చూడసాగారు. క్షణంలో జరుగుతున్నదేమిటో తెలుసుకున్న దళపతి అక్కడ్నుంచి పారిపొమ్మని కేకపెట్టాడు.

జంతువులను కాపాడటానికి ధైర్యం చేసిన బోసు వాటిని కాపాడగలిగాడని జలపతికి, ద్వీపకి అర్థం అయ్యింది. అయితే ఓడ నీటిలోకి జారిపోతుండటం, ఆ చుట్టుపక్కల జంతువుల స్వైర విహారం చూస్తూ, మహాబసు ప్రాణాలతో బయటపడగలడా అని ద్వీప అనుకుంది. మహాబసు అని అందరూ భ్రమ పడుతున్న బోసు ఇక తిరిగిరాడు అని నిర్ధారించుకున్నాడు ఉగ్ర. మరుక్షణం అలా జరగకూడదని మనస్ఫూర్తిగా కోరుకున్నాడు.

వీళ్ళందరి ఏమరుపాటు అదనుగా, దళాధిపతి సైనికులు వాళ్ళను తోసుకుంటూ దూరంగా కనిపిస్తున్న అడవిలోకి పరుగులుపెట్టారు. వాళ్ళ వెనకే ఉగ్ర అనుచరులు దౌడు తీశారు. సుధాముడు మాత్రం కొంత దూరం వెళ్ళి అక్కడే ఆగిపోయి జరగబోయేదేమిటో అన్నట్లు వెనక్కి తిరిగి చూడసాగాడు.

నీళ్ళలో నుంచి వచ్చిన సైనికులు కూడా వాళ్ళని దాటుతుండగా తాము నలుగురే నిలబడి వున్నామని తెలుసుకున్నారు జలపతి, ద్వీప, ఉగ్ర, పశుపాల. అయినా ఎవరికీ అక్కడ్నుంచి వెళ్ళిపోవాలన్న ఆలోచన రాలేదు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు కానీ స్థిరంగా నిలబడ్డారు. సైనికుల వెనక వున్న జంతువులన్నీ వాళ్ళకి దగ్గరగా వచ్చాయి. పారిపోయిన సైనికులు పారిపోగా, కదలకుండా నిలబడిపోయిన నలుగుర్ని అవి చూశాయి. వెంటాడాల్సిన అవసరం లేదని తెలుసుకున్న తరువాత చాలా తాపీగా వాళ్ళ వైపు అడుగులు వేయసాగాయి.

ఉగ్ర తన చేతిలో వున్న కత్తిని బలంగా పట్టుకున్నాడు. జలపతి వడివడిగా నాలుగు అడుగులు వేసి పశుపాలకి, ద్వీపకి ముందు నిలబడ్డాడు. ప్రాణాలను పణంగా పెట్టడానికి సిద్ధపడ్డ ఆ ఇద్దరినీ ఆశ్చర్యంగా చూస్తున్నారు ద్వీప, పశుపాల. క్రూరమృగాలు వాళ్ళకి

దగ్గరగా చేరి భీకరంగా అరిచాయి. మరో క్షణంలో అవి వాళ్ళ మీదకు దూకేస్తాయని అనుకుంటుండగా దూరంగా సముద్రంలో నుంచి ఒక భయంకరమైన ఘీంకారం వినపడింది. ఆ చప్పుడు విన్న నలుగురు తల ఎత్తి చూశారు. అక్కడ –

నాలుగు దంతాలతో, ఇరవై అడుగుల ఎత్తు వున్న ఒక మత్తగజం కనపడింది. మరుక్షణం జంతువులన్నీ ఆ నలుగురి పక్కనుంచి నింపాదిగా నడుచుకుంటూ అడవి వైపుకి వెళ్ళిపోయాయి. జరిగిందేమిటో అర్థం చేసుకుంటున్న నలుగురు మరోసారి మత్తగజం ఘీంకరించడంతో అటువైపు చూశారు. అది తన పొడవైన తొండాన్ని సముద్రపు నీటిలో ముంచి, మరోసారి గట్టిగా అరుస్తూ తొండాన్ని పైకి లేపింది. మెలివేసి వున్న ఆ తొండంతో పాటు బయటకు వచ్చాడు మహాబసు. మత్తగజం అతణ్ణి జాగ్రత్తగా తన మెడమీద కూర్చోపెట్టుకోని ముందుకు కదిలింది.

దూరం నుంచి ఇదంతా గమనిస్తున్న సుధాముడు ఒక్కసారిగా "జయ జయహో మహాబసూ... జయ జయహో మహాబసూ" అంటూ దిక్కులు పిక్కటిల్లేలా కేకలుపెట్టాడు.

ఉగ్ర వెనక్కి తిరిగి తన అనుచరుణ్ణి చూసి, మరోసారి బోసు వైపు చూశాడు. ద్వీప ఆనందంగా గెంతులు వేసింది. పశుపాల సుధాముడి జయధ్వానానికి ప్రతిగా మరోసారి అరిచాడు –

"జయ జయహో మహాబసూ" అంటూ.

జలపతి ఒళ్ళు పరవశంతో ఊగిపోయింది. మత్తగజం దగ్గరపడుతున్న కొద్దీ, మహాబసు పైపైకి ఎదుగుతున్నట్లు అనిపించిందతనికి. అప్పటి దాకా తమతో కలిసి తిరిగిన బోసు మహాబసుగా రూపాంతరం చెందినట్లుగా నిర్ధారించుకున్నాడు. చేతులు జోడిస్తూ "జయ జయహో మహాబసు" అంటూ కిందకు వంగి, మోకాళ్ళపై వాలి, మరోసారి "జయ జయహో మహా..." అంటూ కుప్పకూలిపోయాడు.

ద్వీప ఆనందం క్షణంలో ఆవిరైపోయింది. ఉగ్ర ఆందోళనగా జలపతి దగ్గరకు పరుగెత్తాడు. సుధాముడు పరుగెత్తుకుంటూ వచ్చి ఆశ్చర్యంగా చూస్తున్న పశుపాల పక్కనే నిలబడ్డాడు.

మత్తగజంపై నుంచి ఒక్క ఉదుటున ఎగిరి కిందకు దూకాడు మహాబసు. అప్పటికే "మహాబసు... మహాబసు" అంటూ కలవరిస్తున్నాడు జలపతి. అతని చేతిని తన చేతిలోకి తీసుకోని, అతని తలని తన ఒళ్ళో పెట్టుకున్నాడు...

"మ... హా... బ... సు..." అంటూ అతని కళ్ళల్లోకి చూశాడతను. మహాబసు కూడా జలపతి కళ్ళ వైపే చూశాడు. ఇద్దరి మధ్య ఏదో మౌన సంభాషణ జరిగింది. మహాబసు తలాడించాడు.

"పోరాడతాను" అన్నాడు.

జలపతి కళ్ళలో ఆనందం తళుక్కున మెరిసి అంతలోనే మాయమైంది. ఆ కళ్ళు స్థిరంగా నిలిచిపోయాయి. అతని గుండెపైన దళాధిపతి కత్తి చేసిన గాయం నుంచి రక్తం ధారగా కారుతూ సముద్రపు నీటిలో కలిసిపోతోంది.

★★★

**(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)**

COMMENTS